జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 5 | జూన్ | 2026 | పేజీలు : 7


## జనగణన జాబితా వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలి

**– జిల్లా కలెక్టర్ అంకిత్**



**కలెక్టరేట్ కలెక్టరేట్, జోన్ 4, (ప్రజా జ్యోతి) :** జనగణన-2027 ప్రక్రియలో రూపొందించే జాబితా ప్రజల వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సూపర్వైజర్లతో గురువారం ఐడిఓసి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జనగణన నిర్వహణపై

2 లో

# కూనంనేనికి బైరెడ్డి ఓపెన్ ఛాలెంజ్

**జలగం వెంకట్రావును ఓడిస్తే రాజకీయ సన్యాసం చేస్తాం**

**పొత్తుల్లేక గెలిచే సత్తా ఉందా..?**

**కొత్తగూడెం సీటు కోసం పార్టీని తాకట్టు పెట్టింది ఎవరు..?**

**మీడియా అటెన్షన్ కోసమే మోదీపై విమర్శలు**

**దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పోటీ చేయాలి**

**కమ్యూనిస్టు రాష్ట్రాలు కనుమరుగై.. కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయి**



**కొత్తగూడెం, జూన్ 4 ( ప్రజాజ్యోతి ):** కమ్యూనిస్టు పార్టీలకు ప్రజలు ఎప్పుడో రాజకీయ సన్యాసం ఇచ్చారని అలాంటి పార్టీకి చెందిన నేతలు ఇప్పుడు బీజేపీకి రాజకీయ సన్యాసం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. గురువారం లక్ష్మీదేవిపల్లిలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీ ఒక్క ఎమ్మెల్యే స్థానం గెలిచినా తాను రాజకీయ సన్యాసం చేస్తానంటూ కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలను ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రెండు సార్లు బూర్జువా పార్టీల మద్దతుతోనే ఎమ్మెల్యేగా గెలిచిన కూనంనేనికి బీజేపీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బీజేపీని సవాల్ చేసిన ఎన్నో పార్టీలు, నాయకులు రాజకీయంగా కనుమరుగయ్యారని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు భావజాలం బలహీనపడుతుండగా ఒకప్పుడు కమ్యూనిస్టుల ఆధీనంలో ఉన్న రాష్ట్రాల్లోనే నేడు బీజేపీ కాషాయ జెండాలు ఎగురుతున్నాయని పేర్కొన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో మహాకూటమి మద్దతుతో కేవలం 1,500 ఓట్ల మెజార్టీతో గెలిచిన కూనంనేని 2014లో పోటీ చేసి ఐదో స్థానానికి పడిపోయిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. రెండేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను పక్కనపెట్టి విజయం సాధించారని ఆరోపించారు. ప్రజా మద్దతుతో కాకుండా పొత్తుల రాజకీయాలతో గెలిచిన వారు బీజేపీ బలం గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. కూనంనేనికి నిజంగా ప్రజలపై విశ్వాసం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. అదే ఎన్నికల్లో బీజేపీ తరఫున మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు పోటీ చేస్తారని ఆయనను ఓడించే సత్తా కూనంనేనికి ఉందా అని ప్రశ్నించారు. జలగం వెంకట్రావు బీజేపీ అభ్యర్థిగా ఓడిపోతే తాము రాజకీయ సన్యాసం చేస్తామని బహిరంగ సవాల్ విసిరారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేసి ఎన్నికల అనంతరం అదే కాంగ్రెస్ మద్దతుతో మేయర్ పదవిని దక్కించుకోవడం సీపీఐ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ రోడ్లను తవ్వి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని విమర్శించారు. కొత్త పైప్‌లైన్ల పేరుతో కమిషన్ల రాజకీయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్పొరేటర్లకు కనీస గౌరవం లేకుండా అన్ని పనులను ఎమ్మెల్యేనే పర్యవేక్షిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం పది అసెంబ్లీ స్థానాల్లో కూడా స్వతంత్రంగా పోటీ చేసే బలం లేని కమ్యూనిస్టు పార్టీ..

వివరాలు 2లో..

# వారధి కథలో అదే వ్యథ..!

**– కలల వారధిపై... కష్టాల నీడ**

**– కొత్త వారధి వచ్చినా... తప్పని పాత కష్టాలు**

**– గోదావరి గట్టున... గుబులు పెంచిన గండి**

**– వరదల ముంగిట... భద్రాద్రిని వెంటాడుతున్న సందేహాలు**

**– గండి పూడ్చేదెప్పుడు... గమ్యం చేరేదెప్పుడు..?**



6 లో

# రూ.500 చెల్లిస్తే రూ.15 వేలు వస్తాయట!


**- ఈడీ-సీఎస్ఆర్ స్కాలర్‌షిప్ పేరుతో కొత్త మోసంపై అనుమానాలు**

**- పేద విద్యార్థుల తల్లిదండ్రులే లక్ష్యంగా ఫోన్ కాల్స్**

**- జిల్లాలో పలువురికి వస్తున్న అనుమానాస్పద కాల్స్**

**- ప్రభుత్వం నుంచి అలాంటి పథకం లేదంటున్న అధికారులు**

**- అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్, విద్యాశాఖ హెచ్చరిక**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 4, ప్రజా జ్యోతి:** పేద విద్యార్థుల చదువుల కోసం ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లపై ప్రజల్లో ఉన్న ఆశలను ఆసరాగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "రూ.500 చెల్లిస్తే మూడు నెలల తర్వాత రూ.15 వేల స్కాలర్‌షిప్ మీ ఖాతాలో జమ చేస్తాం" అంటూ తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్ వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలలో వెలుగుచూసిన ఈ వ్యవహారం ఇప్పుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకూ విస్తరించినట్లు సమాచారం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని ఈ కాల్స్ చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆశల వలలో తల్లిదండ్రులు**

గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. "ఈడీ-సీఎస్ఆర్ స్కాలర్‌షిప్" పేరుతో ప్రత్యేక పథకం అమల్లో ఉందని, విద్యార్థి వివరాలు నమోదు చేసి రూ.500 చెల్లిస్తే మూడు నెలల తర్వాత రూ.15 వేల స్కాలర్‌షిప్ నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెబుతున్నట్లు సమాచారం. పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందుతుందనే ఆశతో కొందరు తల్లిదండ్రులు ఈ విషయంపై ఆరా తీస్తున్నారు.

వివరాలు 2లో..

# కూనంనేనికి బైరెడ్డి ఓపెన్ ఛాలెంజ్

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీపై విమర్శలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శలు చేయడం ద్వారా మీడియా అటెన్షన్ పొందడమే కూనంనేని లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోడియం బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాటోత్ వెంకన్న నాయక్, పైడిపాటి రవీందర్, మహిళా నాయకురాలు సముద్రాల గాయత్రి, పాల్వంచ టౌన్ అధ్యక్షుడు రాపాక రమేష్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్, జిల్లా కార్యాలయ కార్యదర్శి దురిశెట్టి కుమార్, జిల్లా కార్యదర్శి తుంపూరి శివ, సీనియర్ నాయకుడు గుములాపురం సత్యనారాయణ, మీడియా కన్వీనర్ రామారావు, జిల్లా నాయకులు, మండల స్థాయి నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన జాబితా వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు కీలకమైన ప్రక్రియ అని అన్నారు. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ సమయంలో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని సూచించారు. జనగణన జాబితాలో నమోదు చేసే సమాచారం వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా, ఉండేలా ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు .సూపర్వైజర్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టి సర్వే పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేకంగా కేటీపీఎస్, సింగరేణి ప్రాంతాల్లో జనగణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు, ఈ సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సూపర్వైజర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలు



**ములకలపల్లి, జూన్ 04, ప్రజాజ్యోతి:** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక భాగంగా మండలంలోని జగన్నాధపురం, పాత గంగారం, చౌటిగూడెం, పాత గుండాలపాడు, గుట్టగూడెం గ్రామ పంచాయతీ లలో ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులు అధ్యక్షతన గురువారం గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. ఈ గ్రామ సభలలో ఆయా పంచాయితీ ల సర్పంచులు కుంజా వినోద్, సోడే చైతన్య, వాడే రాములు, కారం వెంకటేశ్వర్లు, తానం పద్మ లు పాల్గోని మాట్లాడారు. పాతాగంగారం లో జరిగిన గ్రామ సభలో ఎంపిడిఓ రామారావు, ఎంపిఓ రామారావు పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో గ్రామంలో పారిశుద్ధ్యం, పిచ్చిమొక్కల తొలగింపు, మురుగు కాల్వల నిర్వహణ వంటి వాటిపై దృష్టి సారించాలని, వ్యాధులు ప్రబలకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జగన్నాథ పురం గ్రామ సభలో సర్పంచ్ కుంజా వినోద్ మాట్లాడుతూ జగన్నాధపురం గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారం ఎప్పుడు కృషి చేస్తామని అదే విధంగా గ్రామ అభివృద్ధి కి ప్రజలందరూ సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జలగం మాధవి వార్డు సభ్యులు సెక్రటరీ సునేష్ వ్యవసాయ శాఖ ఏడిఓ ఆర్డబ్ల్యూ యస్ ఎఈ గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎన్ఆర్ఈజీఎస్ విద్యా వైద్య ఇరిగేషన్ ఫారెస్ట్ అధికారులుగ్రామ కమిటీ అధ్యక్షులు పామర్తి కృష్ణ మరిది నాగు మీడియం నారాయణ, రామాచారి, కూరం రామకృష్ణ, సోయం బోడప్ప, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# రూ.500 చెల్లిస్తే రూ.15 వేలు వస్తాయట!

**భద్రాద్రికీ చేరిన ఫోన్ కాల్స్**

ములకలపల్లి మండలం ములకలపల్లి గ్రామానికి చెందిన ఓ విద్యార్థి తండ్రికి గురువారం ఇదే తరహా ఫోన్ కాల్ వచ్చినట్లు తెలిసింది. విద్యార్థి వివరాలు నమోదు చేయాలని, ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లించాలని సూచించినట్లు సమాచారం. ఇదే విధంగా జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులకు కూడా కాల్స్ వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

**వివరాల సేకరణపై అనుమానాలు**

ఫోన్ కాల్స్ నమ్మిన కొందరు తల్లిదండ్రులు విద్యార్థుల ఆధార్, బ్యాంకు ఖాతా, ఇతర వ్యక్తిగత వివరాలను నమోదు చేయించేందుకు ఇంటర్నెట్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం. అయితే ఇలాంటి వివరాలను అపరిచితులకు అందించడం వల్ల భవిష్యత్తులో సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**సైబర్ మోసగాళ్ల కొత్త ఎత్తుగడేనా ?**

ఇటీవలి కాలంలో ఉద్యోగాలు, రుణాలు, బహుమతులు, సంక్షేమ పథకాల పేరుతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. ఇప్పుడు విద్యార్థుల భవిష్యత్తును, పేద కుటుంబాల అవసరాలను ఆసరాగా చేసుకుని ఇదే తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రూ. 500 చెల్లిస్తే రూ. 15 వేలు వస్తాయని చెప్పడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటన్న దానిపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ప్రభుత్వం నుంచి అలాంటి పథకం లేదు – ఇంటర్ డి ఐ ఈ ఓ హసావత్ వెంకటేశ్వరావు**

ప్రభుత్వం తరఫున "ఈడీ–సీఎస్ఆర్ స్కాలర్‌షిప్" పేరుతో ఎలాంటి పథకం అమల్లో లేదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హసావత్ వెంకటేశ్వరావు తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా ప్రస్తుతం అలాంటి స్కాలర్‌షిప్ పథకం ఏదీ అమల్లో లేదని తెలిపారు. స్కాలర్‌షిప్ పేరుతో ముందుగా డబ్బులు చెల్లించాలని కోరే వ్యక్తులను నమ్మవద్దని, విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఏదైనా సందేహం ఉంటే సంబంధిత విద్యాశాఖ అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

**అప్రమత్తతే రక్షణ: సముద్రాల జితేందర్, సిఐ సైబర్ క్రైమ్**

స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగాలు, బహుమతులు, పెట్టుబడుల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిభద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ సూచించారు. పిల్లల చదువుల కోసం ఆర్థిక సాయం అందుతుందనే ఆశ ప్రతి తల్లిదండ్రికి సహజమే. అయితే అదే ఆశను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు వల విసిరే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని . ఆకర్షణీయమైన హామీలను నమ్మే ముందు వాటి వాస్తవాలను నిర్ధారించుకోవడం ద్వారా ఆర్థిక నష్టాలతో పాటు వ్యక్తిగత సమాచార దుర్వినియోగాన్ని కూడా నివారించవచ్చని ఆయన సూచిస్తున్నారు. అంతేకాకుండా అపరిచిత వ్యక్తులకు ఆధార్, బ్యాంకు ఖాతా, ఓటీపీ వంటి వ్యక్తిగత వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దన్నారు. అనుమానాస్పద కాల్స్ వచ్చిన వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం అందించడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించాలని కోరారు..

# ఏఐటీయూసీ సభ్యత్వం పొందిన హమాలీ కార్మికులు

**- ఉలవనూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో 45 మందికి సభ్యత్వ నమోదు**

**- కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తాం - అన్నారపు వెంకటేశ్వర్లు**



**పాల్వంచ, జూన్ 4, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలం ఉలవనూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న 45 మంది హమాలీ కార్మికులకు గురువారం ఏఐటీయూసీ సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఏఐటీయూసీ భద్రాద్రి జిల్లా నాయకుడు కామ్రేడ్ అన్నారపు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉలవనూరు కొనుగోలు కేంద్రం పరిధిలో ఏఐటీయూసీ సభ్యత్వం పొందిన హమాలీ కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం కొనుగోలుదారులు మరియు ప్రభుత్వం నుంచి కార్మికులకు అందాల్సిన న్యాయమైన హక్కులు, సంక్షేమ ప్రయోజనాలు పొందే వరకు ఏఐటీయూసీ వారి తరఫున పోరాటం చేస్తూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. అనంతరం కార్మికులతో కలిసి ఏఐటీయూసీ అనుబంధ హమాలీ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘ అధ్యక్షుడిగా కర్రి వెంకటేష్, కార్యదర్శిగా మహంకాళి కృష్ణ, కోశాధికారిగా కాలం సురేష్, ఉపాధ్యక్షుడిగా మోట నాగేష్, సహాయ కార్యదర్శిగా తునికి శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు కామ్రేడ్ నిమ్మల రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కామ్రేడ్ వేములపల్లి శ్రీనివాసరావు, సీపీఐ ఉలవనూరు శాఖ కార్యదర్శి కామ్రేడ్ నిట్ట అమృతరావుతో పాటు కార్మికులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి


**- తహసీల్దార్ స్వర్ణకు వినతిపత్రం అందజేసిన గో సంరక్షణ కార్యకర్తలు**

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 4, ప్రజా జ్యోతి:**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం గో సంరక్షణ కార్యకర్తలు తహసీల్దార్ స్వర్ణకు వినతిపత్రం అందజేశారు. గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, గోమాతకు తగిన గౌరవం కల్పించాలని వారు వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో గోమాతకు విశిష్ట స్థానం ఉందన్నారు. గోవుల రక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గోవుల అక్రమ రవాణా, వధను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గో సంరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయడంతో పాటు గోశాలల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ స్వర్ణకు సమర్పించారు. కార్యక్రమంలో గో సంరక్షణ కార్యకర్తలు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# పంచాయితీలలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే జారేకు వినతి...



**ములకలపల్లి జూన్ 04 ప్రజాజ్యోతి :** మండలంలోని తిమ్మంపేట, తాళ్లపాయి పంచాయితీలలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీను, తాళ్లపాయి సర్పంచ్ గడ్డం సుజాత అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణను గురువారం గండుగులపల్లి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీలలోని పలు గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజిలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ, స్లాబ్ కలవర్టులు, తాళ్ల పాయి దుర్గమ్మ గుడి వద్ద సైడ్ వాల్, రహదారి నిర్మాణం సుమారు 300 మీటర్లు నిర్మించాలని కోరారు. తిమ్మంపేట పంచాయతీలో గతంలో స్థలం లేనందున ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇల్లు లేదని, ప్రస్తుతం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లలో 50 ఇల్లు కేటాయించాలని సర్పంచ్ తుర్రం శ్రీను కోరారు.. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే.. ఆయా శాఖల మండల, జిల్లా అధికారులతో మాట్లాడి ఆ పనులకు అంచనాలు (ఎస్టిమేట్ ) వేసి తనకు వారం రోజుల్లో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల తాజా మాజీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, జహీరుద్దీన్, కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్ ఉన్నారు.

# ఇరవెండి పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి

### -గ్రామసభలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి

**బూర్గంపహాడ్, జూన్ 4 (ప్రజా జ్యోతి):** ప్రజా సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషిచేస్తున్నట్లు జడ్పీ సీఈవో నాగలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో సర్పంచ్ గుండి బాబూరావు అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేయగా ముఖ్యఅతిధిగా పాల్గొన్న జడ్పీ సీఈవో నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రధానంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపికకు సంబంధించి గ్రామసభలో పాలకవర్గం తీర్మానం చేయడంతో పాటు తడి, పొడి చెత్తలో నాలుగు రకాలు ఎలా వేరుచేయాలో । ప్రజలకు అవగాహన కల్పించారు. మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామసభలో చర్చించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజల నుంచి నేరుగా తెలుసుకుని పరిష్కారానికి ఆయా శాఖల అధికారులను తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల మెరుగుదల సంక్షేమ పథకాల అమలు అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జడ్పీ సీఈవో నాగలక్ష్మిని సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ గ్రామసభలో మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, ఉపసర్పంచ్ మహంకాళి రామారావు, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి, వ్యవసాయశాఖ, ఐసీడీఎస్, మిషన్ భగీరథ, విద్యాశాఖకు చెందిన అధికారులు, ఉపాధ్యాయులతో పాటు అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, వీఆర్వో, ఆశాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# వర్షాకాలం వేళ.. పారిశుధ్యంపై దృష్టి సారించాలి


**టేకులపల్లి,జూన్04,ప్రజాజ్యోతి:** 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలోని 9 గ్రామపంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. నల్లమడుగు గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ ఈర్ప విజయ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా టేకులపల్లి మండల ప్రత్యేక అధికారి, ఖమ్మం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కొండపల్లి శ్రీరామ్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పారిశుధ్యం, డ్రైనేజీల శుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సురక్షిత తాగునీరు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యలు,నేటి పారుదల శాఖకు సంబంధించిన సమస్యలు, ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, మొక్కలు పెంపకం,వరద నివారణ చర్యలు కొత్తగా ప్రభుత్వం జారీచేసిన ఎస్ డబ్ల్యూ ఎం నియమ నిబంధనలపై గ్రామస్తులందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఈసం శ్రీనివాసరావు,ఇల్లందు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయభాస్కర్ రెడ్డి, టేకులపల్లి ఇంచార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవీంద్రనాథ్, ఉపాధి పథకం ఏపీఓ కాలంగి శ్రీనివాస్,డి ఆర్ డి ఏ అధికారి రాజు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ తిరుపతి, గ్రామ కార్యదర్శి జీవన్, ఏఈఓ రెహానా బేగం, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంద్రజ, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 118 పాఠశాలలో మహిళలకు ఉద్యోగావకాశాలు

### -ప్రీ-ప్రైమరీ తరగతుల కొరకు ఉపాధ్యాయులు, ఆయాల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

### -జూన్ 8 వరకు దరఖాస్తుల స్వీకరణ

**కొత్తగూడెం, జూన్ 4 ( ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 118 గుర్తింపు పొందిన ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులు, ఆయాల పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) వెల్లడించారు. ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయ పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఆయాల పోస్టులకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత విద్యార్హతగా నిర్ణయించారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఎంపికలు పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన నిర్వహించబడతాయని నియామకాలు తాత్కాలికంగా ఒక విద్యా సంవత్సరానికి మాత్రమే ఉంటాయని తెలిపారు. ఈ కాలంలో కేవలం 10 నెలలకు మాత్రమే పారితోషికం చెల్లించబడుతుందని స్పష్టం చేశారు. ప్రీ-ప్రైమరీ పాఠశాల ఉన్న హాబిటేషన్, గ్రామపంచాయతీ, మండలం, జిల్లా నివాసితులకు వరుస క్రమంలో ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 8 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత మండల విద్యాధికారులకు (ఎంఈఓ) దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుతో పాటు విద్యార్హత ధ్రువపత్రాలు, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జతచేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం సంబంధిత మండల విద్యాశాఖాధికారులను సంప్రదించాలని డీఈఓ సూచించారు.


తేదీ:04.06.2026

పత్రికా ప్రకటన

ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు మరియు ఆయా ల కొరకు దరఖాస్తు చేసుకోండి

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ అడ్మిషన్లకు శ్రీకారం

### ఎర్రగుంట పాఠశాలలో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించిన అదనపు కలెక్టర్ విద్యా చందన



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 4, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) తరగతుల అడ్మిషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ విద్యా చందన గురువారం ప్రారంభించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బూరుగూడెంకు చెందిన షేక్ అబ్దుల్లా కుమారుడు జుబేర్‌కు ప్రీ ప్రైమరీలో ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఉచితంగా అందిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనందకుమార్ మాట్లాడుతూ అన్నదేవం, రాజపురం, ఎర్రగుంట ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతి లభించిందని తెలిపారు. త్వరలోనే ఆయా పాఠశాలల్లో విద్యా వాలంటీర్లు, ఆయాలను నియమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డిగూడెం సర్పంచ్ సున్నం నాగభూషణం, ఎర్రగుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, రాజపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారావత్ రమేష్, ఎర్రగుంట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శాంతకుమారి, సుశీల, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లపల్లిలో 108 అంబులెన్స్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అధికారి

### - ఆళ్లపల్లి 108 అంబులెన్స్ పనితీరును పరిశీలించిన జిల్లా అధికారి కురుమ సతీష్



**ఆళ్లపల్లి,జూన్4. ప్రజా జ్యోతి :** ఆళ్లపల్లి మండల కేంద్రంలో సేవలు అందిస్తున్న 108 అంబులెన్స్ వాహనాన్ని గురువారం కొత్తగూడెం జిల్లా అధికారి కురుమ సతీష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలోని వైద్య పరికరాలను, వాటి పనితీరును ఆయన నిశితంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనం ఎలాంటి మరమ్మతులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర సమయాల్లో 108 సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో 108 సిబ్బంది పరమ సునీల్ కుమార్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషా వైభవం భావితరాలకు అందించాలి: ఈవో దామోదరరావు



**భద్రాచలం టౌన్ , జూన్ 4 , ప్రజాజ్యోతి,** తెలుగు భాష గొప్పదనాన్ని, మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) కె.దామోదరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో రాజమండ్రి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా ఈనెల 6, 7 తేదీలలో నిర్వహించనున్న '7వ ప్రపంచ తెలుగు సాహితీ మహాసభల' గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. తెలుగు భాష విశిష్టతను, మన కళలను, కళాకారుల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ మహాసభలు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. కవులు, సాహితీవేత్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాసభల సమన్వయకర్త, స్వర్ణనంది గ్రహీత సురేష్ బాబు మాట్లాడుతూ.. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీ భూషణం, ప్రణాళికాధికారి పార్థసారథి నేతృత్వంలో ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని తెలిపారు. దేశ విదేశాల నుండి సుమారు 5 వేల మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తోటమల్ల, దుర్గాప్రసాద్, ఈవో సీసీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# విజయ్ నాయుడు జన్మదిన వేడుక లక్ష్మీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహణ



**చర్ల, జూన్ 04: (ప్రజా జ్యోతి ):** చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు జన్మదిన వేడుకలను లక్ష్మీ కాలనీ గ్రామపంచాయతీ నాయకులు, కాలనీ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి విజయ్ నాయుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న విజయ్ నాయుడు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల ప్రేమాభిమానాలే నా జీవితంలో అతిపెద్ద ఆస్తి

**- చివరి రక్తపు బొట్టు వరకు ప్రజాసేవలోనే కొనసాగుతా**

**- మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు**

**- పాతపాల్వంచలో వనమా దంపతులకు ఘన సన్మానం**



**పాల్వంచ, జూన్ 4, ప్రజాజ్యోతి:** రాజకీయాలకు అతీతంగా తన పుట్టిన గడ్డైన పాతపాల్వంచలో మాజీ మంత్రి, ప్రజానాయకుడు వనమా వెంకటేశ్వరరావు, ఆయన సతీమణి వనమా పద్మావతిని గ్రామ ప్రజలు, అభిమానులు, పాతతరం నాయకులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశం భావోద్వేగ వాతావరణంలో సాగింది. సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదమే తనకు బలమని, తన రాజకీయ జీవితమంతా ప్రజల ప్రేమాభిమానాలతోనే ముందుకు సాగిందని అన్నారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన తాను పాతపాల్వంచ గ్రామ సర్పంచ్‌గా ప్రజాసేవను ప్రారంభించి, మున్సిపల్ చైర్మన్, ఆర్టీసీ చైర్మన్, నాలుగు సార్లు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రిగా పనిచేసే అవకాశం ప్రజల ఆదరణ వల్లే లభించిందని పేర్కొన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం తనకు కన్నతల్లితో సమానమని, ఈ ప్రాంత ప్రజలు, రైతులు, కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించానని చెప్పారు. అవసరమైన సందర్భాల్లో ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టానని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించానని గుర్తుచేశారు. పాతపాల్వంచ మట్టిలో ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగిందని, తన జీవితంలో సంపాదించుకున్న గొప్ప ఆస్తి ప్రజల ప్రేమాభిమానాలేనని అన్నారు. "నా చివరి రక్తపు బొట్టు వరకు ప్రజాసేవలోనే కొనసాగుతాను. ప్రజల కోసం పనిచేయడమే నా జీవిత లక్ష్యం" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు వనమా వెంకటేశ్వరరావు ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానాన్ని, ప్రజాసేవలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. వనమా దంపతులతో కలిసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ క్షణాలను పంచుకున్నారు. పుట్టిన ఊరి ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వనమా దంపతులను ఘనంగా సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో హరి సత్యనారాయణ, శేషం రాజు, జాన్మియా, గంధమల రాజయ్య, ముత్యాల వీరభద్రం, పరిటాల విష్ణుమూర్తి, దేవదానం, అల్లం వెంకట్రామయ్య, జయమ్మ, చాంద్ పాషా, ఎస్కే ఖాసిం, ముత్యాల రమణమూర్తి, కార్పొరేటర్లు బత్తుల మధుచంద్, జీవీఆర్, గుణచరిత్, ముత్యాల ప్రవీణ్, బత్తుల నాగరాజు, కిలారి సుజాత, డాక్టర్ మస్తాన్, గౌస్, పిల్లల గంగాధర్, బొందిలి శేషగిరి, యాదయ్య, ఏనుగుల శ్రీను, మిరియాల అలివేలు, జూపెల్లి దుర్గాప్రసాద్, కంచర్ల రామారావు, వాసుమల్ల గౌతమ్, అల్లి సాయికిరణ్, ప్రణయ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో 4.480 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

**- నలుగురు అరెస్ట్ -- రెండు మోటార్ సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లు సీజ్.**

**పాల్వంచ, జూన్ 4, ప్రజాజ్యోతి:** ఖమ్మం అబ్కారీ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పాల్వంచలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో 4.480 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసిన అధికారులు, వారి వద్ద ఉన్న రెండు మోటార్ సైకిళ్లు మరియు మూడు సెల్‌ఫోన్లను కూడా సీజ్ చేశారు. ఖమ్మం అబ్కారీ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ ఎస్ఐ శ్రీ హరి రావు ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన దాడుల్లో ఈ పట్టివేత జరిగింది. నిందితులు గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన అధికారులు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు ఎం.డి. ఖలీల్ అహ్మద్, జమాల్ షరీఫ్‌తో పాటు కానిస్టేబుళ్లు ప్రసన్న, ఉపేందర్, నాగరాజ్, వి. శివశంకర్ పాల్గొన్నారు. అక్రమ మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అబ్కారీ అధికారులు హెచ్చరించారు.



# వారధి కథలో అదే వ్యథ..!

**- కలల వారధిపై... కష్టాల నీడ**

**- కొత్త వారధి వచ్చినా... తప్పని పాత కష్టాలు**

**- గోదావరి గట్టున... గుబులు పెంచిన గండి**

**- వరదల ముంగిట... భద్రాద్రిని వెంటాడుతున్న సందేహాలు**

**- గండి పూడ్చేదెప్పుడు... గమ్యం చేరేదెప్పుడు..?**

భద్రాచలం రెండో వారధి... ఇది కేవలం ఒక వంతెన కాదు. లక్షలాది మంది భక్తుల ఆకాంక్షలకు, అంతర్రాష్ట్ర రవాణా అవసరాలకు, భద్రాద్రి ప్రజల దశాబ్దకాల నిరీక్షణకు ప్రతీక. పదేళ్లపాటు ఎన్నో అవరోధాలు, విమర్శలు, రాజకీయ హామీలు, నిధుల సమస్యలు దాటి ఎట్టకేలకు అందుబాటులోకి వస్తోందని ప్రజలు ఆనందపడుతున్న వేళ మరోసారి పనుల కోసం రాకపోకలు నిలిపివేయడం కొత్త చర్చకు దారితీసింది. ఇప్పటికే వర్షాకాలం ముంచుకొస్తుండగా మరమ్మతులు, పెండింగ్ పనులు ఎంత వేగంగా పూర్తవుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గోదావరి వరదలు రాకముందే పనులు పూర్తవుతాయా? ప్రజల నిరీక్షణకు ఎప్పుడు తెరపడుతుంది? అనే ప్రశ్నలు భద్రాద్రిని వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రాచలం రెండో వారధి చుట్టూ కొనసాగుతున్న పరిణామాలపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (భూక్యా రంజిత్ నాయక్),** జూన్ 4, ప్రజా జ్యోతి: భద్రాచలానికి వారధి అవసరం ఎంత కీలకమో 1957 జూన్ 26న జరిగిన ఘోర పడవ ప్రమాదం దేశానికి గుర్తు చేసింది. గొమ్మూరు రేవు నుంచి భద్రాచలం వైపు వస్తున్న భక్తులతో నిండిన పడవ గోదావరిలో మునిగిపోవడంతో 300 మందికిపైగా జలసమాధి అయ్యారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆ ఘటన తర్వాతే భద్రాచలం వద్ద శాశ్వత వారధి నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. దీంతో 1959లో మొదటి వారధి నిర్మాణానికి శంకుస్థాపన జరగగా, 1965లో అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారు. అప్పటి నుంచి దాదాపు ఆరు దశాబ్దాలుగా ఆ వారధే భద్రాద్రి ప్రజల జీవనాడిగా కొనసాగుతోంది.

**రద్దీ పెరిగింది... రెండో వారధి అనివార్యమైంది.**

కాలక్రమేణా భద్రాచలం అంతర్రాష్ట్ర రవాణాకు ప్రధాన కూడలిగా మారింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లకు వెళ్లే వాహనాలతో పాటు సారపాక ఐటీసీ పరిశ్రమకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించడం ప్రారంభమైంది. ఇసుక రవాణా లారీలు, భారీ సరకు వాహనాల ఒత్తిడితో పాత వారధిపై భారం పెరిగింది. శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి వంటి ప్రధాన వేడుకల సమయంలో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించే పరిస్థితి ఏర్పడేది. దీంతో రెండో వారధి నిర్మాణం అత్యవసరమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.

**పదేళ్ల నిరీక్షణ... దశాబ్దం పట్టిన నిర్మాణం**

2015 ఏప్రిల్ 1న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేసిన రెండో వారధి అప్పట్లో భద్రాద్రి ప్రజల్లో కొత్త ఆశలు నింపింది. త్వరలోనే ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అందరూ భావించారు. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. నిర్మాణ జాప్యాలు, సాంకేతిక సమస్యలు, పరిపాలనా అడ్డంకులు, నిధుల విడుదలలో ఆలస్యాలు ప్రాజెక్టును పదేళ్లపాటు లాగాయి. ఎన్నోసార్లు ప్రారంభ తేదీలు ప్రకటించినా ప్రజల ఆశలు నెరవేరలేదు. చివం-కు పనులు పూర్తయ్యాయని, ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అధికారులు ప్రకటించడంతో భద్రాద్రి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

**కలల వారధిపై కష్టాల నీడ**

ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన రెండో వారధిపై రాకపోకలు ప్రారంభమైన కొద్ది రోజులకే మళ్లీ నిలిపివేయడం చర్చనీయాంశంగా మారింది. సారపాక వైపు అప్రోచ్ ప్రాంతంలో పనులు కొనసాగుతుండటంతో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యగా రాకపోకలను నిలిపివేశారు. దీంతో కొత్త వారధి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని భావించిన ప్రజలు మరోసారి నిరాశకు గురయ్యారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత కూడా పనులు కొనసాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**గోదావరి గట్టున గుబులు పెంచిన గండి**

వారధి అప్రోచ్ ప్రాంతంలో నేల కుంగిపోవడం, మట్టి జారిపోవడం వంటి దృశ్యాలు స్థానికుల్లో ఆందోళనకు కారణమయ్యాయి. అయితే ఇది నిర్మాణ వైఫల్యం కాదని, పెండింగ్‌లో ఉన్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల భాగమేనని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ కొత్తగా నిర్మించిన ప్రాజెక్టులో ఇలాంటి పరిస్థితులు కనిపించడంతో ప్రజల్లో అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టుపై మరింత పారదర్శకత అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**రిటైనింగ్ వాల్ పనుల కోసమే నిలిపివేత**

ఈ అంశంపై నేషనల్ హైవే అథారిటీ అధికారులను సంప్రదించగా కీలక వివరాలు వెల్లడించారు. వారధి ప్రారంభ భాగంలో నిర్మించాల్సిన రిటైనింగ్ వాల్ పని ఇంకా పెండింగ్‌లో ఉందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం గతంలో ఆ పని పూర్తికాకముందే వాహన రాకపోకలను ప్రారంభించామని, ప్రస్తుతం ఉన్నతాధికారుల అనుమతితో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపడుతున్నామని వివరించారు. భద్రతా కారణాల దృష్ట్యా తాత్కాలికంగా వాహన రాకపోకలను నిలిపివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మరో 20 నుంచి 25 రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.





**వరదల ముంగిట పెరుగుతున్న ఆందోళన**

ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమవుతోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే గోదావరిలో వరద ప్రవాహం పెరగడం సహజం. ఈ నేపథ్యంలో రిటైనింగ్ వాల్ పనులు నిర్ణీత గడువులోగా పూర్తవుతాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వరదలు ముందుగా వస్తే పనులపై ప్రభావం పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీంతో అధికారుల హామీలపై ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**కొత్త వారధి వచ్చినా... తప్పని పాత కష్టాలు**

కొత్త వారధిపై రాకపోకలు నిలిచిపోవడంతో మొత్తం ట్రాఫిక్ మళ్లీ పాత వంతెనపైనే పడింది. ఇప్పటికే ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన పాత వారధి మళ్లీ భారీ వాహనాల ఒత్తిడిని భరిస్తోంది. ఏ చిన్న ప్రమాదం జరిగినా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించే పరిస్థితి కొనసాగుతోంది. రెండో వారధి వస్తే సమస్యలు తీరతాయని భావించిన ప్రజలు ఇప్పుడు మళ్లీ పాత కష్టాలనే ఎదుర్కొంటున్నారు.

**గండి పూడ్చేదెప్పుడు... గమ్యం చేరేదెప్పుడు..?**

భద్రాచలం రెండో వారధి కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదు. భద్రాద్రి అభివృద్ధికి, అంతర్రాష్ట్ర అనుసంధానానికి, లక్షలాది మంది భక్తుల ప్రయాణ సౌలభ్యానికి ప్రతీక. పదేళ్ల నిరీక్షణ తర్వాత కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. పదేళ్ల నిరీక్షణ తర్వాత అందుబాటులోకి వచ్చిన రెండో వారధి మళ్లీ పనుల కారణంగా తాత్కాలికంగా మూతపడటంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. మరోవైపు 20 నుంచి 25 రోజుల్లో పనులు పూర్తవుతాయని అధికారులు హామీ ఇస్తున్నారు. అయితే వర్షాకాలం ముంచుకొస్తున్న వేళ ఆ గడువులోనే పనులు పూర్తి చేసి వారధిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలరా లేదా అన్నదే ఇప్పుడు భద్రాద్రి ప్రజల్లో ప్రధాన చర్చగా మారింది.

# హమాలీ అడ్డ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి

**- రోడ్డు పక్కన పడి ఉన్న మృతదేహం గుర్తించిన స్థానికులు**

**- పోలీసులకు సమాచారం.**

**పాల్వంచ, జూన్ 4, ప్రజాజ్యోతి:**

పాల్వంచ పట్టణంలోని హమాలీ అడ్డ ప్రాంతంలో, స్పైసీ హోటల్ ఎదురుగా గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు సుమారు 55 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రోడ్డు పక్కన మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. ట్రాలీ అడ్డ డ్రైవర్లు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం



ఉదయం సుమారు 9 నుంచి 10 గంటల సమయంలో ఆ వ్యక్తి అక్కడే రోడ్డు పక్కన కూర్చొని కనిపించాడని, అనంతరం కొంతసేపటికి అతను కదలికలు లేకుండా ఉండటంతో పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించామని తెలిపారు. మృతుడు నీలి రంగు చొక్కా, కాఫీ రంగు ప్యాంటు, బెల్ట్ ధరించి ఉన్నాడు. అతని పక్కన ఒక టవల్ కూడా ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, అతని గుర్తింపు కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యులు లేదా బంధువులు ఎవరైనా ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

# విద్యుత్ కోసం రెండేళ్ల నిరీక్షణ... అధికారుల నిర్లక్ష్యానికి గుండ్లమడుగు బలి

**- రూ.6 వేల చలానా వసూలు చేసినా కదలని విద్యుత్ పనులు.**
**- అటవీ శాఖ ఎన్‌వోసీ పేరుతో జాప్యం -- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న గ్రామస్థులు.**



**పాల్వంచ, జూన్ 4, (ప్రజాజ్యోతి):** పాల్వంచ మండలం ఉలవనూరు, లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గుండ్లమడుగు గ్రామ ప్రజలకు విద్యుత్ సౌకర్యం ఇప్పటికీ అందని ద్రాక్షగానే మారింది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, నేటికీ విద్యుత్ కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొనడం పట్ల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి విద్యుత్ కనెక్షన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన విద్యుత్ శాఖ అధికారులు సుమారు రూ. 6 వేల చలానా వసూలు చేసినప్పటికీ, రెండేళ్లు గడిచినా ఒక్క విద్యుత్ స్తంభం కూడా ఏర్పాటు చేయలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. డబ్బులు వసూలు చేయడంలో చూపిన చొరవ, పనులు చేపట్టడంలో కనిపించడం లేదని వారు మండిపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం అటవీ శాఖ నిరభ్యంతర ధృవీకరణ పత్రం (ఎన్‌వోసీ) జారీ కాకపోవడమే జాప్యానికి కారణమని చెబుతున్నారు. మరోవైపు అటవీ శాఖ అధికారులు కూడా ఫైళ్లను ముందుకు కదపకపోవడంతో గ్రామ ప్రజలు రెండు శాఖల మధ్య నలిగిపోతున్నారు. రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఎన్‌వోసీ మంజూరు కాకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికే సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి పురోగతి కనిపించకపోవడం గ్రామస్థులను నిరాశకు గురిచేస్తోంది. ప్రజల ప్రాథమిక అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించడంలో సంబంధిత శాఖలు ఎందుకు విఫలమయ్యాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గుండ్లమడుగు గ్రామానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యుత్, అటవీ శాఖల మధ్య సమన్వయం సాధించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించి గ్రామ ప్రజల ఇబ్బందులను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే అధికారుల నిర్లక్ష్యానికి గిరిజన, గ్రామీణ ప్రజలే బలవుతున్నారనే విమర్శలు మరింత తీవ్రం కానున్నాయి.

# మైనార్టీ నాయకులకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలి






**ఇల్లందు, జూన్ 4, (ప్రజాజ్యోతి):** గడిచిన పదేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఎవరూ బయటకు రాని పరిస్థితుల్లో కూడా పార్టీ అధికారమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించిన మైనార్టీ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇబ్రహీం కోరారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మైనార్టీ నాయకులు చేసిన సేవలను గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ప్రభుత్వ పదేళ్ల పాలనలో అధికార బలంతో మైనార్టీ నాయకులను అనేక ఇబ్బందులకు గురిచేసినప్పటికీ భయపడకుండా, ఎదురొడ్డి నిలబడి పోరాడిన ఘనత మా జిల్లా నాయకులదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో ?జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి మైనార్టీల అభ్యున్నతికి పాటుపడటమే కాకుండా జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగరడంలో కీలక భాగస్వామ్యులైన క్రింది నాయకులకు అధిష్ఠానం తగిన న్యాయం చేయాలని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవులలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ?మహ్మద్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ ?ఇబ్రహీమ్ లకు స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ?పార్టీ కోసం నిబద్ధతతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన ఈ ఇద్దరం నాయకుల సేవలను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం గుర్తించాలని ఇబ్రహీమ్ కోరారు. రాబోయే నామినేటెడ్ పదవుల కేటాయింపులో వీరికి సముచిత స్థానం కల్పించి, జిల్లా మైనార్టీల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు.

# విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీలు

**- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**
**- జిల్లా వ్యవసాయ అధికారి వి బాబూరావు**







**ములకలపల్లి, జూన్ 04 (ప్రజాజ్యోతి):** ములకలపల్లి మండలంలోని పలు విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్ బాబుతో కలిసి నిర్వహించిన ఈ తనిఖీల్లో వరి, పత్తి విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్‌లు, సోర్స్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, వానాకాలానికి సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. అన్ని విత్తన దుకాణాలు స్టాక్ రిజిస్టర్లు, సోర్స్ సర్టిఫికెట్లు, స్టాక్ బోర్డులను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు విత్తనాల విక్రయ సమయంలో తప్పనిసరిగా బిల్లులు జారీ చేయాలని తెలిపారు. నియమ నిబంధనలను ఉల్లంఘించిన డీలర్లపై విత్తన చట్టం-1966 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వం ద్వారా లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, తగిన వర్షపాతం లేకుండా పొడి దుక్కిలో పత్తి విత్తనాలు విత్తరాదని తెలిపారు. అలా చేస్తే మొలక శాతం తగ్గి దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. కనీసం 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత మాత్రమే పత్తి విత్తనాలు విత్తాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా లేబుల్ లేని లేదా అక్రమంగా విక్రయించే లూజు విత్తనాలను కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. అలాంటి ఘటనలు గమనించిన వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే నిషేధిత బీజీ-3 పత్తి విత్తనాలను కొనుగోలు చేయరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్ బాబు, రైతులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

# గ్రీన్ హిల్స్ టౌన్ షిప్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**ఎమ్మెల్యే సహకారంతో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక.**
**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్**



**పాల్వంచ, జూన్ 4, (ప్రజాజ్యోతి):** పాల్వంచ పట్టణంలోని బసవతారక కాలనీ సమీపంలో ఉన్న గ్రీన్ హిల్స్ టౌన్ షిప్ నివాసితుల కుటుంబాల సమావేశం ఆదివారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ హాజరై కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో గ్రీన్ హిల్స్ టౌన్ షిప్‌లో నెలకొన్న సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించి, ప్రణాళికాబద్ధంగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా, మెరుగైన విద్యుత్ సరఫరా, సురక్షిత త్రాగునీటి సౌకర్యాల కల్పనకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కాలనీలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నివాసితుల రక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. గ్రీన్ హిల్స్ టౌన్ షిప్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తూ, కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. సమావేశంలో కాలనీవాసులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సిపిఐ నాయకులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పట్టం కట్టిన ఎస్‌కేఎస్ ట్రస్ట్





**చర్ల, జూన్ 04: (ప్రజా జ్యోతి ):** విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యా రంగంలోనే కాకుండా జీవితంలోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) పరిటాల వెంకట రమణ సూచించారు. చర్ల మండలంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన ఎస్‌కేఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, జ్ఞాపికలు అందజేసే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మొత్తం 35 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించి రూ. 1.48 లక్షల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పదో తరగతిలో మండల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థితో పాటు ప్రైవేట్ పాఠశాల టాపర్‌కు చెరో రూ. 10 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. అదేవిధంగా నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన శ్రీవాణి విద్యానికేతన్ విద్యార్థి కొంగర గణేష్‌కు రూ. 5 వేల నగదు పురస్కారం అందజేశారు. తెలంగాణ ఆర్జేసీ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంకు సాధించిన గురుదేవ్ విద్యాలయ విద్యార్థిని బూహ్యవరపు మాధురిని ప్రత్యేకంగా అభినందిస్తూ రూ. 10 వేల నగదు బహుమతి, జ్ఞాపికను అందించారు. విద్యార్థులతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఏడుగురు మహిళా రైతులను, ముగ్గురు గ్రామపంచాయతీ కార్మికులను శాలువాలతో సన్మానించి నూతన వస్త్రాలను అందజేశారు. సమాజంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఎస్‌కేఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ షాజహాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో వెంకటరమణ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించే లక్ష్యంతో ట్రస్ట్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రతి ఏడాది ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సాహకాలు అందిస్తున్న షాజహాన్--ముంతాజ్ దంపతుల సేవలను ప్రశంసించారు. దాతల సహకారంతో అందుతున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు గ్రామ సర్పంచ్ కాక రాజు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి భాను ప్రియాంక, రౌతు నర్సింహారావు, హెచ్‌జీవీ ప్రసాద్, ఎంపీఎల్ నర్సింహారావు, ఏడారి భూపతి, శ్రీనివాస్, ముంతాజ్, అక్బర్ షా, నీలి ప్రకాష్, ముమ్మినేని అరవింద్, దుబ్బా రాజు తదితరులు పాల్గొన్నారు.